# వానపాములా కాటేస్తాయి

హోటల్ ప్రియాంక్ !!

అయిదు నక్షత్రాల హోటల్ అతి వైభవంగా వుంది. అందులో వున్న సదుపాయాలకు అరిస్టోక్రాట్ వ్యవస్థ ముచ్చటపడుతోంది. రెండేళ్ళ కింద టూస్టార్ హోటల్‌గా వెలసిన ప్రియాంక్ ఈరోజు రెండువందల గదుల ఫైవ్‌స్టార్‌గా ఎదిగిందంటె అందరికీ గుర్తొచ్చే వ్యక్తి....

ప్రదీప్ !!

అతడిలో కృషివుంది. అందుకే ఋషిలా వుంటాడు. మేనేజ్‌మెంటులో అతడెంత తలమునకలవుతాడో దేశంలోని మిగతా ఫైవ్‌స్టార్ హోటల్స్ యజమానులకు తెలుసు. అందుకే అతన్ని చేరదీయాలని చాలా మంది ప్రయత్నిస్తారు.

పబ్లిసిటీనించి వసతుల వరకు అన్నిట్లోనూ వైవిధ్యం కన్పిస్తుందంటె కారణం ప్రదీప్!. చివరికి ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో మన ఇండియన్ గ్రూప్‌కి చెందిన ఓబెరాయ్ హోటల్ కూడా ప్రయత్నించి విఫలమైంది. హోటల్ మేనేజ్‌మెంట్ డిప్లొమా పూర్తిచేసి వచ్చినప్పటి నించి అతనెప్పుడు 'ప్రియాంక్'ని విడిచి వెళ్ళలేదు.

ఆ సోకాల్డ్ ప్రపంచంలో అతడు 'మహర్షి'లా వుంటాడు. అక్కడ బీరు నించి షివాస్ రీగల్ వరకు ప్రవహించినా... క్యాబరేడాన్స్‌ల నుండి అరిస్టోక్రాటిక్ లేడీస్‌తో వ్యభిచారం జరిగినా అతడికే అలవాట్లు లేవు.

ఆరోజు హోటల్‌సూట్‌లో వున్నపుడు 'ప్రిన్సూంక్' ఆవరణలోకి నల్లటి బెంజ్‌కారు వచ్చింది. ఆకాశంలో నల్లటి మబ్బులున్నాయి. స్విమ్మింగ్‌పూల్‌లో జలకాలాడే వాళ్ళంతా గదుల్లోకి చేరుకున్నారు. హోట ల్లోకి ఎవరు అడుగుపెట్టినా ఇద్దరు అందగత్తెలు స్వాగతం చెపుతారు. అది 'ప్రిన్సూంక్' ప్రత్యేకత.

ప్రదీప్ ఫోన్‌లో మాట్లాడుతుండగానే బెంజ్‌కారులోంచి ఒకమ్మాయి దిగింది. మెరుపుతీగలా!! ఇరవై ఏళ్లుంటాయేమో...చుడిదార్‌లో అందంగా వుంది. ఎప్పుడూ ఎవర్నీ పట్టించుకోని ప్రదీప్ కొద్దిక్షణాలు తనని తాను మర్చిపోయి చూసాడు. రిసెప్షనిస్టు వనజ చిటిక వేయటంతో ఈ లోకంలో పడి సిగ్గుపడ్డాడు.

'లవ్ ఎట్ ఫస్ట్ సైట్ ఈజ్ వెరీకరెక్ట్' అంది నవ్వుతూ రిసెప్ష నిస్టు వనజ. "ఛఛా... అదేంకాదు" అంటూనే మళ్ళీ ఆ అమ్మాయివైపు చూసేడు. తలెత్తి మబ్బులుపట్టిన ఆకాశాన్ని చిత్రంగా చూస్తోంది. అప్పుడే చినుకులు మొదలయ్యాయి. ఆమె పురివిప్పిన నెమలిలా చేతులు సాచి నవ్వుతోంది. 'చిన్నపిల్ల మనస్తత్వం' అనుకున్నాడు ప్రదీప్.... అప్పుడే గమనించాడు ఆకాశంలోంచి రాళ్ళు పడుతున్నాయని. ఆమె మంచు రాళ్ళు పడుతుంటే ఏరుకుంటూ కొన్ని నోట్లో పోసుకొని మరికొన్ని పిడికిళ్లలో పట్టి... ఆ చల్లదనం ఒళ్లంతా ప్రాకుతోంటే సన్నగా వణుకుతూ నవ్వు తోంది.

ప్రదీప్ పది నిమిషాలపాటు అలాగే చూస్తుండిపోయాడు. అంతలో వర్షం ఉధృతం కాగానే ఆమె సర్రున రిసెప్షన్ హాల్‌లోకి వచ్చింది సగం తడిసి. ఆమె పిడికిళ్ల నిండా మంచురాళ్లున్నాయి. అవి కరిగి వేళ్లసందు ల్లోంచి చల్లటినీరు కారుతోంది.

'నమస్తే' బాధ్యతగా చెప్పింది రిసెప్షనిస్ట్.

'హలో' అనేసి ప్రదీప్‌వైపు చూసి చిత్రంగా భుజాలెగరేసింది.

"సూపర్ హాండ్సమ్.... వానపామూ" అని ఒక మంచు రాయిని ప్రదీప్ గళ్లలోంచి టక్ చేయబడ్డ షర్ట్‌లోకి జారవిడిచి పరిగెత్తింది. ప్రదీప్ కూడా వానపాములా ఎర్రగా పొడుగ్గా నిండుగా వుంటాడు. నడుం దగ్గర చల్లదనం గిలిగింతలు పెడుతుంటె ప్రదీప్ మెలికలు తిరిగాడు. వనజ బిగ్గరగానవ్వి 'రూమ్ నంబర్ 66లో నిన్న సాయంత్రమే దిగింది. సిల్లీగర్ల్' అంది.

"స్టుపిడ్ గాళ్... పేరు చూసి చెప్పండి."

'అశ్లేష'

కోపమొచ్చినా 'నైస్‌నేమ్' అనుకున్నాడు ప్రదీప్. అలా మొదలైన పరిచయం పదిహేనోరోజు నాటికి ప్రేమకు నాందిపలికింది. తనకు సంబంధించిన ఏ వివరాలు చెప్పకపోయేది. ఏ పనిమీద ఆ హోటల్లో దిగిందో అసలే చెప్పకపోయేది. కాని ఆమె చూపులు అతన్ని రెచ్చగొట్టేవి. ప్రదీప్‌ని "వానపామూ" అని నిక్‌నేమ్‌తో పిలిచేది. ఉల్లిపొర లాంటి గౌను వేసుకొని సాయంత్రం స్విమ్మింగ్‌పూల్‌లో చేపలా ఈదుతుంటే అతడి నరాలు జివ్వుమనేవి. ఆమె నించి ఎప్పుడూ వింత పరిమళం వచ్చేది. ప్రతిరోజూ అయిదున్నరకే స్విమ్మింగ్‌కి వచ్చేది. ఆరోజు ఆరుదాటినా రాలేదు. ప్రదీప్ ఆగలేకపోయాడు. రూం నంబర్ 66 వైపు కదిలి వోరగా వేసివున్న తలుపుని నెట్టి గదిలోకెళ్లాడు.

బాత్ టబ్‌లోంచి అప్పుడే లేచివచ్చి ఫ్యాన్‌కింద తలారబెట్టుకొంటోంది. ఆమె వెంట్రుకలు సముద్రతరంగాల్లా లేచి పడుతున్నాయి. పాలరాతి శిల్పంలాంటి ఒంటిచుట్టూ పల్చటి గౌను. అందులోంచి రెచ్చగొట్టే అందాలు!

ప్రదీప్‌ని చూసి "హాయ్" అంది. ఊపిరి బిగపట్టినా చాతి పొంగుతుంటే అతడి కళ్లు అందాన్వేషణ జరుపుతున్నాయి. అది పసిగట్టిన అశ్లేష మైకంగా ఒళ్లు విరుచుకుంది. నింగిని తాకే పరువాలు వికసించాయి. అంతే! నిలదొక్కుకోలేకపోయాడు. త్రాచుపాములా చుట్టుకుపోయాడు. అతడి

అధరాలు శివతాండవం చేస్తున్నాయి. ఆమె ఒంటిమీది గౌను జారిపోయింది. పావుగంట సేపు నగ్నసౌందర్యాన్ని అధరాలతో అదిమాడు. ఎక్కడో విస్ఫోటనాలు.... అతని చెయ్యి ఆమె నాభి కిందుగా పోతుంటే కెవ్వున అరిచింది.

ప్రదీప్ ప్రశ్నార్థకంగా ప్రక్కకి ఒరిగాడు.

అంతే.... గాజులు గల్లుమని పగులగొట్టుకుంది. జుత్తును చిందర వందర చేసుకుంది. హిస్టీరియా వచ్చినదానిలా ఒళ్లంతా కొరుక్కుంది. పగిలిన గాజుతో రెండుచోట్ల చీల్చుకుంది.... ఎర్రటిరక్తం.

గౌను కప్పుకొని బిగ్గరగా ఏడుస్తూ అరవసాగింది.

ప్రదీప్ నిశ్చేష్టుడయ్యాడు.

క్షణాల్లో జనం చేరుకుంది ఆ గదిలో....

"ఈ డామిట్‌గాడు నన్ను రేప్ చెయ్యబోయాడు." ఏడుస్తూ చెప్పింది అశ్లేష. ప్రదీప్ గుండెల్లో బడబాగ్నులు ప్రేలినయ్. వేరే గదుల్లోంచి బిలబిలా పరిగెత్తుకొచ్చారు. కలకలం బయల్దేరింది.

"తన్నండి వెధవని"

"త్రొక్కండి ఈడియట్‌ని"

"మేనేజర్ హోదాలో వున్నాడు... ఇదేం బుద్ధి??"

"మేకవన్నెపులులు, డామిట్స్"

"ఇలాంటివాళ్లని నరికి పోగులెయ్యాలి"

"ప్రియాంక హోటల్‌కు తలవంపులు"

శూలాల్లా పొడుస్తున్నారు, ఈటెల్తో గుచ్చుతున్నారు. అదే హోటల్లో దిగిన ఇద్దరు జర్నలిస్టులు కెమెరాల్తో వచ్చారు. ఫ్లాష్‌లు క్లిక్‌మన్నాయి.

ఆ గందరగోళంలోకి ప్రియాంక్ హోటల్ యజమాని మక్తర్‌సింగ్ రావటం... అతని కళ్లు ఎర్రబడివున్నాయి.

"సార్... నేను...." ప్రదీప్ ఏదో చెప్పబోయాడు.

"యూ స్టుపిడ్.... నిన్ను చూస్తే అసహ్యం వేస్తోంది." అన్నాడు సీరియస్‌గా. ఆమాట తగిలి గాలానికి గ్రుచ్చబడుతున్న వానపాములా గిల గిలా కొట్టుకుంది ప్రదీప్ మనసు.... 'ఆమె కూడా మిమ్మల్ని ప్రేమిస్తుందో లేదో తెలుసుకోలేకపోయారా' రిసెప్షనిస్టు పనజ మాట.

ఆమె ఏడుస్తూనే వుంది.

ప్రదీప్ తలొంచుకున్నాడు.

"హే అమ్మాయ్.... నిజంగా నిన్ను రే...ప్ చేసాడా ?" ఒక కంచుకంఠం గంభీరంగా పలుకటంతో అందరూ అతనివైపు వింతగా చూసారు. నిండుసూట్‌లో వున్నాడు. ఆమాటకు అశ్లేష ఉలిక్కిపడి ఎదురుగా చూసి మరింత బిగ్గరగా ఏడ్చింది.

ఆమె నటనకు అతడు చప్పట్లు చరిచాడు.

"వెరీగుడ్... బాగా ఏడుస్తున్నావ్. దయచేసి ఇక్కడెవరయినా సూది, దారం తెచ్చివ్వగలరా" అతని మాటకు ఆశ్చర్యపోయారంతా! ఆ వెంటనే అక్కడికి చేరిన ఒక బట్లర్ సూదీ, దారాన్ని క్షణంలో తెచ్చిచ్చాడు.

"పాపా... నువ్వేమనుకోకపోతే ఈ సూదిని నీ వేళ్లమధ్య త్రిప్పుతూ దారం పెట్టగలవా?

అశ్లేష వింతగా చూసింది. రోషంతో ముక్కుపుటాలెగరేసింది.

"కమాన్... మీరు రేప్ చేయబడ్డట్టు మాకెలా తెలియాలి మరి?" అంతా ప్రేక్షకులై చూస్తున్నారు. అశ్లేష చరచరా అతడి ముందుకు వచ్చి సూదీ దారాన్ని లాక్కొంది.

బొటనవ్రేలు, చూపుడువేలు మధ్య నిలబెట్టిన సూదిని, వ్రేళ్లమధ్యే త్రిప్పుతూ దారం పెట్టడానికి ప్రయత్నించింది.

క్షణాలు... నిమిషాలు.... పావుగంట దాటినా సాధ్యంకాలేదు.

"మీరు రేప్ చేయబడలేదు" ఆ వ్యక్తి సీరియస్‌గా అన్నాడు. "సూది కొంచెమైన సహకరించనిదే దారం పెట్టడం కష్టమమ్మా" అన్నాడు.

అతడి 'పచ్చి'మాటకి అశ్లేష ముఖం కందగడ్డలా మారింది.

అతడు ప్రదీప్ భుజంమీద చెయ్యి వేసి "కమాన్ మై బాయ్" అన్నాడు.

ప్రియాంక్ హోటల్ 'లాబీ' నుంచి బయటికి వస్తుంటే తిరిగి ఆ హోటల్లో కాలుపెట్టాలనిపించలేదు ప్రదీప్‌కి.

"నా పేరు ధనుంజయరావ్.... ఈ హోటల్లో ఆ అమ్మాయి రూమ్ ప్రక్కనే నా గది. అల్లరి జరుగుతుంటే వచ్చాను. ఉద్యోగం పోయిందని బాధపడకు, బెంగుళూరులో నాకూ స్టార్ హోటలుంది. హోటల్ ప్రశాంతి! నిన్ను నేను ఉద్యోగంలో చేర్చుకుంటాను" అన్నాడతను గంభీరంగా.

ప్రదీప్ కళ్లు ఆర్ద్రంగా కన్నీళ్లతో నిండిపోయాయి. ధనుంజయరావ్ ప్రదీప్ చేతుల్ని ఆప్యాయంగా నొక్కాడు. ఆమె ఎందుకలా ప్రవర్తించిందో ప్రదీప్‌కు అర్థంకావట్లేదు.

అల్లరిగా ఆమే 'వానపాము' అని పిలిచినట్టుగా... ఆ పిలుపు గుండెల్లో ప్రతిధ్వనిస్తుంటే తల విదిలించాడు. తను దిగజారిపోయాడా అని ఆత్మవిమర్శలోపడ్డాడు.

* * *

బెంగుళూర్‌లో నెలరోజులు గడిచాయి.

'హోటల్ ప్రశాంతి'లో ప్రదీప్ తలమునకలయ్యే పనిలో వున్నపుడు నల్లటి బెంజ్‌కారు వచ్చింది. ఆ కారుని చూచి ప్రదీప్ కళ్లలో ఎరుపు జీరలు ప్రాకుతుండగానే హొయలుగా దిగింది అశ్లేష!

ప్రదీప్ పిడికిళ్లు బిగుసుకున్నాయి అయితే నిలదొక్కుకున్నాడు. ఆమె రిసెప్షన్ రూంలోకి వెళుతుందని ఊహించి తను అక్కడికి కదిలాడు. కాని ప్రదీప్‌ని చూచి 'హలో.... వానపాము' అని తల నిర్లక్ష్యంగా ఎగరేసి కుడివైపునవున్న ఒక ప్రత్యేకమైన గదిలోకి పోయింది.

ఆ గది ధనుంజయరావుది. సామాన్యంగా ప్రదీప్ పర్మిషన్ లేనిది ఎవ్వరు అందులోకి చొరవగా వెళ్ళరు. ఆ వైంకి ధనుంజయరావ్ అంతకు

ముందు ఆ హోటల్లో పట్టుబడిన ప్రముఖ స్మగ్లర్ సుకూర్ నారాయణ్ బాకియా కేసులో పోలీసులు పంపిన నోటీసులు చూస్తున్నాడు.

'లాబీ'లోంచి చూస్తున్న ప్రదీప్‌కి ఆ గదికున్న గ్లాస్‌విండోలోంచి అశ్లేష వెళ్లి ధనుంజయరావ్‌ని 'విష్' చేయటం ఆయన నవ్వి కూచోమని సైగ చేయటం చూసి ప్రదీప్ నిర్విణ్ణుడయ్యాడు.

ఆశ్చర్యంతో కూడిన ప్రదీప్ ముఖంలో అనుమానం భృకుటిని ముడివేసింది. వాళ్లు ఏం మాట్లాడుకుంటున్నారో విన్పించటంలేదు. కాని ఒకటి దృఢపడింది. వాళ్లిద్దరు చాలా సన్నిహితులు...! కాని ఆరోజు....??

అది నాటకమయివుండాలి. ఎందుకలా ఆడాల్సివచ్చింది! అతడి ఆలోచనలతో మెదడు నరాలు ప్రకంపిస్తున్నాయి. నుదుటిమీద స్వేదం పేరుకుంటోంది. పదినిమిషాల తర్వాత అశ్లేష బయటికి వచ్చింది. చిలక పచ్చరంగు పట్టుచీరలో అందంగా వుంది. ఆ చీరలోంచి ముడతలుపడ్డ నడుము కుచ్చిల్ల మాటున చెలియలి కట్టను దాటాలనే 'ఎర్రసముద్రం' లా వుంది. అప్సరసలాంటి అందం దగ్గరవుతుంటే ప్రదీప్ గుండెల్లో కోపం స్థానే చిక్కని ఆవేదన నిండిపోయింది. గతం తాలూకు స్మృతులు నిండి గుండె బరువయింది.

'అశ్లేషా' అన్నాడు. ఆ పిలుపులో ఉద్రేకంలేదు, ఉద్వేగం లేదు. హృదయాన్ని పిండిపేసే ఆర్ద్రత వుంది. ఆ పిలుపుకి సర్రున వెనక్కి తిరిగి అశ్లేష గబగబా ప్రదీప్ ముందుకొచ్చింది.

"షటప్.... నన్ను పిలిచే అర్హత కూడా లేదు నీకు. హోటల్ ప్రశాంతికి ఒక సమర్థవంతమైన మేనేజర్‌ని తీసుకురావాలనే ప్రయత్న ములో.... ఆరోజు ఆ నాటక మాడాము. చేప కావాలంటే వానపాము బలికావాలిగాని....చేపకూ, వానపాముకూ ప్రేమ తగదు మిస్టర్.

నా ప్రేమకు నోచుకోవాలంటే నువ్వు మరో పదిజన్మలెత్తాలి" అనేసి విసవిసా వెళ్ళిపోయింది.

ప్రదీప్ మనసులో ఈటెల్లా దిగబడ్డాయి ఆ మాటలు. అన్నిరోజుల సరసాలు నటన అని తెలిసాక మరోసారి రెక్కలు తెగిపడ్డ పావురంలా ప్రదీప్ కలవరపడ్డాడు. ధనుంజయరావు మీద అసహ్యం వేసింది. అక్కడ వుండాలనిపించలేదు.

మూడుగంటల తర్వాత ఫోన్ రింగయింది. ధనుంజయరావు గదిలో.

'హలో....' అన్నాడు చాలా క్యాజువల్‌గా

"సార్.... నేను డియస్పీని మాట్లాడుతున్నాను. బౌద్ధనగర్‌లో ఓ ఇంట్లో ఒకమ్మాయి రేప్ చేయబడి చచ్చిపోయింది. ఆమె హాండ్ బ్యాగ్‌లో 'అశ్లేష... కేరాఫ్ మీ అడ్రస్ వుంది.... మీరొకసారి రావటం మంచిది. నేను 'లావణ్య బుక్‌స్టాల్' నించి మాట్లాడుతున్నాను..."

అతడు కలవరపాటుగా ఫోన్ క్రెడిల్ చేస్తుంటే టేబిల్ మీద ప్రదీప్ పంపిన 'రిజిగ్నేషన్ లెటర్' రెపరెపలాడింది నిజమేనన్నట్లుగా !! ★